జాతీయ వైద్య సలహా మండలి ఏర్పాటు చేసిన కేంద్రం

అంతర్జాతీయం

నిధుల సంక్షోభంలో ఐక్యరాజ్యసమితి

ఐక్యరాజ్యసమితి తీవ్రమైన నిధుల కొరతలో ఉందని సంస్థ ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గ్యుటెరస్ ఆందోళన వ్యక్తం చేశారు. ఉద్యోగులకు వచ్చే నెల వేతనాలిచ్చేందుకూ సరిపోను నిధులు లేవన్నారు. ఐక్యరాజ్యసమితిలో ఈ దశాబ్దంలో ఈ స్థాయి సంక్షోభం ఎన్నడూ లేదన్నారు. సంస్థకు ఇస్తామని ప్రకటించిన నిధులను తక్షణమే అందించాలని 193 సభ్య దేశాలకు అక్టోబర్ 8న విజ్ఞప్తి చేశారు. 2017, 2018 సంవత్సరాలకు గానూ 73 దేశాలు మాత్రమే, మార్చి నాటికి తమ వాటాను పూర్తిగా చెల్లించాయని తెలిపారు. 2018 చివరి నాటికి సభ్య దేశాల నుంచి సంస్థకు అందాల్సిన నిధులు 529 మిలియన్ డాలర్లు. ఐక్యరాజ్యసమితికి భారత్ తరఫున చెల్లించాల్సిన పూర్తి స్థాయి నిధుల్ని ఇప్పటికే అందజేశామని మన దేశ ఐరాస శాశ్వత ప్రతినిధి సయ్యద్ అక్బరుద్దీన్ వెల్లడించారు.

ఉగ్రవాదంపై చర్యల్లో పాక్ విఫలం : ఎఫ్ఏటీఎఫ్

ఉగ్రవాదాన్ని అణచివేయడానికి, ఉగ్రసంస్థలకు ఆర్థిక సాయం అందకుండా అడ్డుకునే చర్యలు తీసుకోవడంలో పాకిస్తాన్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్ ఫోర్స్(ఎఫ్ఏటీఎఫ్) నివేదిక వెల్లడించింది. ఐక్యరాజ్యసమితి భద్రతామండలి తీర్మానాలన్నీ పాక్ తుంగలో తొక్కిందని ఎఫ్ఏటీఎఫ్ మండిపడింది. పాక్ తీసుకుంటున్న ఉగ్రవాద నిరోధక చర్యలు 40లో 31 ఎఫ్ఏటీఎఫ్ ప్రమాణాలకు అనుగుణంగా లేవని తేల్చింది. అంతర్జాతీయంగా మనీలాండరింగ్ కార్యక్రమాలపై ఎప్పటికప్పుడు నివేదికలు అందించే ఎఫ్ఏటీఎఫ్ 2018 ఏడాదిలోనే పాకిస్తాన్‌ను గ్రే లిస్ట్‌లో ఉంచింది.

ఇరాన్ ఫుట్‌బాల్ స్టేడియాల్లోకి మహిళలు

ఇరాన్‌లో ఫుట్‌బాల్ మ్యాచ్‌లను స్టేడియాలకు వెళ్లి చూడడానికి మహిళలను కూడా అనుమతిస్తున్నట్టు ఇరాన్ ప్రభుత్వం ప్రకటించింది. ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లోని ఆజాది స్టేడియంలో అక్టోబర్ 10న ఇరాన్-కంబోడియా మధ్య 2022 వరల్డ్‌కప్ క్వాలిఫయర్ మ్యాచ్ జరగనుంది. ఈ మ్యాచ్‌కు మహిళలు హాజరు కానున్నారు. 1981 నుంచి ఇరాన్‌లో క్రీడా మైదానాల్లోకి స్త్రీలకు ప్రవేశం లేదు. ఇది ఇలాగే కొనసాగితే ఇరాన్‌ను అంతర్జాతీయ ఫుట్‌బాల్ నుంచి బహిష్కరిస్తామని ఫిఫా హెచ్చరించడంతో ఇరాన్ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.

చైనా అధ్యక్షుడితో ఇమ్రాన్‌ఖాన్ భేటీ

చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో పాకిస్తాన్ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ చైనా రాజధాని బీజింగ్‌లో 2019 అక్టోబర్ 9న భేటీ అయ్యారు. కశ్మీర్‌లో ఆర్టికల్ 370, 35ఏ రద్దు తర్వాత నెలకొన్న ప్రస్తుత పరిస్థితులను పరిశీలిస్తున్నామని జిన్‌పింగ్ ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. శాంతియుత చర్చల ద్వారా కశ్మీర్ సమస్యను పరిష్కరించగలమని అభిప్రాయ పడ్డారు. చైనా, పాకిస్తాన్ మధ్య స్నేహం ధృడమైనదని.. అంతర్జాతీయ, జాతీయ పరిస్థితులు దీనిని విడదీయలేవని స్పష్టం చేశారు. చైనా, పాక్‌ల మధ్య సహకారం బలంగానే ఉంటుందని పేర్కొన్నారు.

28 చైనా కంపెనీలపై అమెరికా ఆంక్షలు

చైనాలోని షింజియాంగ్ ప్రాంతంలో ఉయిఘర్ ముస్లిం మైనారిటీలపై చైనా మానవ హక్కుల ఉల్లంఘనకు పాల్పడుతుందని అమెరికా తెలిపింది. ఈ విషయంలో చైనాకు మద్దతుగా నిలిచిన 28 చైనా కంపెనీలపై ఆంక్షలు విధిస్తున్నట్లు అమెరికా వాణిజ్య విభాగం 2019 అక్టోబర్ 7న ప్రకటించింది. ఈ కంపెనీలను నిషేధిత జాబితాలో చేర్చినట్లు పేర్కొంది. దీంతో ఈ 28 కంపెనీలు ఎగుమతులు, దిగుమతులు, సాంకేతికత మార్పిడికి సంబంధించి కొత్త అనుమతులు లేదా అదనపు లెసైన్స్‌లు పొందాల్సి ఉంటుంది. అలాగే ఇప్పటి వరకు కల్పించిన రాయితీలను సైతం ఎత్తివేసే అవకాశం ఉంది.

జాతీయం

భారత్‌కు తొలి రఫేల్ యుద్ధ విమానం

ఫ్రాన్స్ నుంచి భారత్‌కు తొలి రఫేల్ యుద్ధ విమానం అందింది. భారత వాయుసేన వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకొని 2019 అక్టోబర్ 8న ఫ్రాన్స్ రాజధాని పారిస్‌లో గల మిరిన్యాక్ వైమానిక స్థావరం వద్ద తొలి రఫేల్ విమానాన్ని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ లాంఛనంగా అందుకున్నారు. శస్త్ర పూజ పేరుతో యుద్ధ విమానానికి పూజలు చేశారు. అనంతరం సుమారు 25 నిమిషాలపాటు రఫేల్ విమానంలో రాజ్‌నాథ్ చక్కర్లు కొట్టారు. మొత్తం 36 రఫేల్ యుద్ధ విమానాల కొనుగోలుకు సంబంధించిన ఒప్పందంపై భారత్, ఫ్రాన్స్ లు 2016 సెప్టెంబరులో సంతకాలు చేశాయి. ఈ ఒప్పందం విలువ రూ.58 వేల కోట్లు. ఫ్రాన్స్ కు చెందిన డసో ఏవియేషన్ సంస్థ రఫేల్ విమానాలను తయారుచేస్తుంది.

బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనా భారత పర్యటన

భారత్, బంగ్లాదేశ్‌ల మధ్య సంబంధాలు ప్రపంచానికే ఆదర్శం కావాలని రెండు దేశాల ప్రధానులు నరేంద్రమోడి, షేక్ హసీనాలు ఆకాంక్షించారు. ఉగ్రవాద నిర్మూలనకు కలిసి పనిచేయాలని ఇరు ప్రధానులు నిర్ణయించారు. 2019 అక్టోబర్ 5 నుంచి నాలుగు రోజుల పాటు హసీనా భారత్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా రెండు దేశాల మధ్య ఏడు ఒప్పందాలు కుదిరాయి. హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం, డాకా విశ్వవిద్యాలయం మధ్య ఒప్పందం కుదిరింది.

వెంకయ్యనాయుడికి కామోరోస్ అత్యున్నత పురస్కారం

భారత్, కామోరోస్ దేశాల మధ్య రక్షణ, ఆరోగ్య రంగాలు సహా పలు అంశాల్లో పరస్పర సహకారానికి విస్తృత అవకాశాలు ఉన్నాయని ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు తెలిపారు. కామోరోస్ పర్యటనలో 2019 అక్టోబర్ 11న ఆ దేశ అధ్యక్షుడు అజాలీ అసౌమనితో రాజధాని మొరోనిలో భేటీ అయ్యారు. ద్వైపాక్షిక అంశాలపై చర్చించారు. రెండు దేశాల మధ్య 6 ఒప్పందాలు కుదిరాయి. ఈ సందర్భంగా కామోరోస్ అత్యున్నత పురస్కారం 'ద ఆర్డర్ ఆఫ్ ద గ్రీన్ క్రెసెంట్'ను ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడికి అధ్యక్షుడు అజాలీ అందజేశారు.

చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ భారత పర్యటన

చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ 2019 అక్టోబర్ 11న చెన్నైలో పర్యటించారు. ప్రధానమంత్రి నరేంద్రమోడితో కలసి జిన్‌పింగ్ బంగాళాఖాతంలో కోరమండల్ తీరాన కొలువు తీరిన మామల్లాపురం(మహాబలిపురం)లో అధికార లాంఛనాలకు దూరంగా మామూలు వ్యక్తుల్లా కలియదిరిగారు. సూర్యాస్తమయ వేళ ఆహ్లాదకర వాతావరణంలో రాతి నిర్మాణాలను వీక్షిస్తూ, తాజా కొబ్బరినీళ్లను సేవిస్తూ, భారత సాంస్కృతిక వారసత్వానికి దర్పణం పట్టిన నృత్య ప్రదర్శనలను తిలకిస్తూ, పసందైన విందును ఆస్వాదిస్తూ ఇద్దరూ ముచ్చటించుకున్నారు. మోడి, జిన్‌పింగ్ మధ్య 2018లో చైనాలోని వుహాన్ నగరంలో ఇలాంటి ఇష్టాగోష్ఠి భేటీ జరిగింది.

ఈ-దంత్‌సేవ వెబ్‌సైట్ ప్రారంభం

నోటి ఆరోగ్యం పట్ల ప్రజలకు అవగాహన పెంచేందుకు 'ఈ-దంత్‌సేవ' పేరుతో రూపొందించిన వెబ్‌సైట్, మొబైల్ యాప్‌లను కేంద్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హర్షవర్ధన్ న్యూఢిల్లీలో 2019 అక్టోబర్ 7న ప్రారం భించారు. అంధుల కోసం బ్రెయిలీ బుక్‌లెట్‌ను మంత్రి ఆవిష్కరించారు. ఒక్క క్లిక్‌తో నోటి ఆరోగ్యం గురించి సమస్త సమాచారం తెలిపేందుకు వీలుగా ఈ-దంత్‌సేవను రూపొందించినట్లు మంత్రి చెప్పారు.

వాహన నేరాలకూ ఐపీసీ వర్తింపు: సుప్రీం

మోటారు వాహన చట్టాన్ని అతిక్రమించిన వారు భారతీయ శిక్షా స్మృతి(ఐపీసీ)ని కూడా అతిక్రమించినట్లేనని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఈ రెండూ చట్టాలు వాటి పరిధుల్లో చక్కగా పనిచేస్తున్నాయని పేర్కొంది. మోటారు వాహన చట్టానికి చెందిన కేసులను ఐపీసీ కింద పరిగణించలేమంటూ 2008 డిసెంబరు 22న గౌహతి హైకోర్టు ఇచ్చిన తీర్పును విచారిస్తూ సుప్రీంకోర్టు 2019 అక్టోబర్ 6న ఈ వ్యాఖ్యలు చేసింది. గౌహతి హైకోర్టు ఇచ్చిన తీర్పును కొట్టివేసింది. జస్టిస్ ఇందు మల్హోత్రా, జస్టిస్ సంజీవ్ ఖన్నాల ధర్మాసనం ఈ కేసును విచారించింది.

జాతీయ వైద్య సలహా మండలి ఏర్పాటు

కేంద్ర ప్రభుత్వం కొత్తగా రూపొందించిన జాతీయ వైద్యకమిషన్ చట్టం ప్రకారం జాతీయ వైద్య సలహా మండలి ఏర్పాటైంది. ఈ మేరకు 2019 అక్టోబర్ 11న కేంద్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రిత్వశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. దీనికి వైద్య కమిషన్ ఛైర్మన్ ఎక్స్ అఫీషియో ఛైర్మన్‌గా ఉంటారు. దేశంలోని 29 రాష్ట్రాలకు చెందిన వైద్య విశ్వవిద్యాలయాల వైస్ ఛాన్స్‌లర్లు, 7 కేంద్రపాలిత ప్రాంతాల వైద్య సంస్థలకు చెందిన అధిపతులకు ఇందులో సభ్యత్వం కల్పించింది. 24 రాష్ట్రాల వైద్య మండళ్లకు సభ్యత్వం ఇచ్చింది. ఆంధ్రప్రదేశ్ నుంచి ఎన్టీఆర్ వైద్యవిశ్వవిద్యాలయం వైస్ ఛాన్స్‌లర్, వైద్య మండలి ప్రతినిధి బూచిపూడి సాంబశివారెడ్డి, తెలంగాణ నుంచి కాళోజీ నారాయణరావు వైద్య విశ్వవిద్యాలయం వైస్ ఛాన్స్‌లర్ కరుణాకర్‌రెడ్డి, వైద్య మండలి ప్రతినిధి ఇ.రవీంద్రరెడ్డి ఇందులో సభ్యులుగా ఉంటారు.

పోటీతత్వ సూచీలో భారత్‌కు 68వ స్థానం

అంతర్జాతీయ ఆర్థిక వేదిక (డబ్ల్యూఈఎఫ్) అక్టోబర్ 8న విడుదల చేసిన 58వ అంతర్జాతీయ పోటీతత్వ సూచీ(గ్లోబల్ కాంపిటీటివ్ ఇండెక్స్)లో భారత్ 10 స్థానాలు దిగజారి 68వ స్థానంలో నిలిచింది. మొత్తం 141 దేశాలను పరిగణనలోకి తీసుకుని ఈ సూచీని రూపొందించారు. అంతర్జాతీయంగా అత్యంత పోటీపడగల ఆర్థిక వ్యవస్థగా సింగపూర్ అవతరించింది.

ధ్రువ్ కార్యక్రమం ప్రారంభం

ప్రధానమంత్రి సృజనాత్మక అభ్యసన కార్యక్రమం ధ్రువ్ (DHRUV)ను బెంగళూరులోని ఇస్రో ప్రధాన కార్యాలయంలో కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి రమేష్ పొక్రియాల్ అక్టోబర్ 10న ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... మెరికల్లాంటి 60 మంది విద్యార్థులను ఎంపిక చేసి, వారికి ఆసక్తి ఉన్న రంగాల్లో 14 రోజులపాటు శిక్షణ అందిస్తామని చెప్పారు.

ఈ-అసెస్‌మెంట్ సెంటర్ ప్రారంభం

ఎలక్ట్రానిక్ (ఫేస్‌లెస్) అసెస్‌మెంట్ స్కీమ్‌కు సంబంధించిన నేషనల్ ఈ-అసెస్‌మెంట్ సెంటర్‌ను(ఎన్ఈఏసీ) కేంద్ర రెవెన్యూ విభాగం కార్యదర్శి అజయ్ భూషణ్ పాండే న్యూఢిల్లీలో 2019 అక్టోబర్ 7న ప్రారంభించారు. పన్నుల మదింపు ప్రక్రియలో అధికారుల ప్రమేయాన్ని గణనీయంగా తగ్గించేందుకు ఆదాయపు పన్ను శాఖ ఎలక్ట్రానిక్ (ఫేస్‌లెస్) అసెస్‌మెంట్ స్కీమ్‌ను ప్రవేశపెట్టింది. ఈ-అసెస్‌మెంట్ అందుబాటులోకి రావడంతో అసెసింగ్ అధికారులను పన్ను చెల్లింపుదారులు ప్రత్యక్షంగా కలవాల్సిన సందర్భాలు గణనీయంగా తగ్గనున్నాయి. ఎన్ఈఏసీ స్వతంత్ర కార్యాలయంగా పని చేస్తుందని ఆర్థిక శాఖ తెలిపింది. హైదరాబాద్ సహా ఢిల్లీ, ముంబై, చెన్నై, కోల్‌కతా తదితర 8 నగరాల్లో ప్రాంతీయ ఈ-అసెస్‌మెంట్ కార్యాలయాలు (ఆర్ఈఏసీ) ఉంటాయని పేర్కొంది. ప్రతీ ఆర్ఈఏసీకి ఆదాయపు పన్ను విభాగం చీఫ్ కమిషనర్ సారథ్యం వహిస్తారని వివరించింది.

యన్.సంతోష్‌కుమారాచారి
జీకే,కరెంట్ అఫైర్స్ నిపుణులు
హైదరాబాద్
ఫోన్ : 9848286270

జాతీయ అంధత్వ, దృష్టి లోపాల సర్వే-2019

జాతీయ అంధత్వ, దృష్టి లోపాల సర్వే-2019 నివేదికను కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి హర్షవర్ధన్ 2019 అక్టోబరు 10న విడుదల చేశారు. 2007తో పోలిస్తే ప్రస్తుతం దేశంలో అంధుల సంఖ్య 47 శాతం తగ్గిందని ఈ సర్వేలో తేలింది. 2020 కల్లా మొత్తం జనాభాలో అంధుల సంఖ్యను 0.3 శాతానికి తగ్గించాలంటూ ప్రపంచ ఆరోగ్య సంస (డబ్ల్యూహెవో) విధించిన లక్ష్యానికి చేరువైనట్లు పేర్కొంది. భారత్‌లో అంధుల సంఖ్య 2006-07లో 1.2 కోట్లు ఉండగా, 2019 నాటికి 48 లక్షలకు చేరింది.

భారత్‌కు స్విస్ బ్యాంకు ఖాతాదారుల జాబితా

స్విట్జర్లాండ్ బ్యాంకుల్లో భారత పౌరుల ఖాతాల వివరాలతో కూడిన మొట్టమొదటి జాబితాను స్విట్జర్లాండ్ ప్రభుత్వం 2019 అక్టోబర్ 7న భారత్‌కు అందజేసింది. 2018లో కుదిరిన ఆటోమేటిక్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ ఇన్ఫర్మేషన్(ఏఈఓఐ) ఒప్పందం ప్రకారం ప్రస్తుతం మనుగడలో ఉన్న, 2018లో మూసివేసిన అకౌంట్ల వివరాలు ఈ జాబితాలో ఉన్నాయని స్విస్ ప్రభుత్వం తెలిపింది. రెండో జాబితాను 2020 సెప్టెంబర్‌లో అందజేస్తామని పేర్కొంది.

భారత్‌పై మందగమన ప్రభావం : ఐఎంఎఫ్

భారత్ వంటి అభివృద్ధి చెందుతున్న దేశాలపై అంతర్జాతీయ ఆర్థిక మందగమన ప్రభావం ఒక్కింత ఎక్కువగా ఉండనుందని అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ (ఐఎంఎఫ్) చీఫ్ క్రిస్టాలినా జార్జివా పేర్కొన్నారు. 2019, అక్టోబర్ 14 నుంచి 20 వరకు అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ, ప్రపంచబ్యాంక్ వార్షిక సమావేశం జరగనుంది.

భారత్ వృద్ధి 5.8 శాతమే: మూడీస్

2019-2020 ఆర్థిక సంవత్సరంలో భారత్ స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) వృద్ధి రేటు 5.8 శాతంగానే ఉంటుందని మూడీస్ ఇన్వెస్టర్స్ సర్వీస్ అంచనా వేసింది. గతంలో తాను ప్రకటించిన 6.2 శాతం అంచనాను 5.8 శాతానికి కుదించింది. పెట్టుబడుల మందగమనం దీనితో వినియోగం తగ్గడం, గ్రామీణ ప్రాంతాల్లో ద్రవ్యపరమైన ఒత్తిడులు, ఉపాధి కల్పనలో వెనుకబాటు వంటి అంశాలు వృద్ధి రేటు అంచనా తాజా కోతకు కారణమని మూడీస్ అక్టోబర్ 10న పేర్కొంది. అయితే 2020-21లో దేశ జీడీపీ వృద్ధి 6.6 శాతం ఉంటుందని వెల్లడించింది.

భారత్ వృద్ధి 6.1 శాతం : ఇండియా రేటింగ్స్

2019-20లో భారత్ వృద్ధి రేటు 6.1 శాతం ఉంటుందని ఇండియా రేటింగ్స్ అండ్ రీసెర్చ్ అంచనావేస్తోంది. బలహీన డిమాండ్ తమ తాజా అంచనాలకు కారణంగా పేర్కొంది.

ప్రాంతీయం

వైద్య విధాన పరిషత్ కమిషనర్‌గా రమేశ్‌రెడ్డి

వైద్య విద్య సంచాలకులుగా పనిచేస్తున్న డాక్టర్ రమేశ్‌రెడ్డికి వైద్య విధాన పరిషత్(వీవీపీ) కమిషనర్‌గా పూర్తి స్థాయి అదనపు బాధ్యతలను ప్రభుత్వం అప్పగించింది. ఆరోగ్యశ్రీ హెల్త్‌కేర్ ట్రస్టు ముఖ్య కార్యనిర్వహణాధికారిగా, హైదరాబాద్ జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న మాణిక్‌రాజ్ ఇప్పటి వరకూ వైద్య విధాన పరిషత్ కమిషనర్‌గా కూడా అదనపు బాధ్యతలు నిర్వహించారు. తాజాగా వీవీపీ కమిషనర్ బాధ్యతను మాత్రం రమేశ్‌రెడ్డికి అప్పగిస్తూ వైద్య ఆరోగ్యశాఖ 2019 అక్టోబర్ 11న ఉత్తర్వులు జారీ చేసింది.

epaper.navatelangana.com

మంగళపల్లి లాజిస్టిక్ ప్రారంభోత్సవం

రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజక వర్గంలోని మంగళపల్లిలో దేశంలోనే పీపీపీ(ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యం) విధానంలో ఏర్పాటు చేసిన తొలి లాజిస్టిక్ పార్కును మంత్రి కేటీఆర్ 2019 అక్టోబర్ 11న ప్రారంభించారు. వస్తు నిల్వ కేంద్రాలు. ఇతర ప్రాంతాల నుంచి నగరానికి సరకులను తీసుకొచ్చే భారీ వాహనాలు నేరుగా ఇక్కడికి చేరుకుంటాయి. సరుకులను నిల్వ చేసేందుకు శీతల గిడ్డంగులు ఇక్కడ అందుబాటులో ఉంటాయి. ఇక్కడి నుంచి చిన్న చిన్న వాహనాల ద్వారా గమ్యస్థానాలకు సరుకుల్ని చేర్చవచ్చు. ఒకేసారి వందలాది ట్రక్‌లను పార్కింగ్ చేసుకోవడానికి అవకాశముంటుంది. ఒక్కో లాజిస్టిక్ పార్కుతో ప్రత్యక్షంగా, పరోక్షంగా అనేక మందికి ఉపాధి లభిస్తుంది.

స్థానికత గడువు మరో రెండేళ్లు పెంపు

రాష్ట్ర విభజన అనంతరం తెలంగాణ నుంచి ఆంధ్రప్రదేశ్‌కు తరలివచ్చే వారికి స్థానికత కల్పించడానికి ఇప్పటివరకూ ఉన్న ఐదేళ్ల గడువును ఏడేళ్లకు పెంచుతూ కేంద్ర హోంశాఖ 2019 అక్టోబర్ 11న ఉత్తర్వులు జారీచేసింది. దీని ప్రకారం నవ్యాంధ్రప్రదేశ్ ఏర్పడిన 2014 జూన్ 2 నుంచి ఏడేళ్లలోపు తెలంగాణ నుంచి ఆంధ్రప్రదేశ్‌కు తరలివచ్చిన వారు అక్కడ స్థానికత పొందడానికి వీలవుతుంది. రాష్ట్ర విభజన జరిగి ఐదేళ్లయిన తర్వాతా ఇప్పటికీ వివిధ పోలీసు కేడర్‌తోపాటు, షెడ్యూల్ 9, 10 సంస్థల విభజన అంశం కొలిక్కిరాకపోవడంతో ఈ సమస్య పరిష్కారానికి ఇంకా సమయం పట్టే అవకాశం ఉన్నందున చాలామంది సందిగ్ధంలో ఉన్నారు. దీంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేసిన విజ్ఞప్తిని కేంద్ర హోంశాఖ మన్నించి ఆ మేరకు ఉత్తర్వులు జారీచేసింది. తొలి ఉత్తర్వుల ప్రకారం 2017 జూన్ 2వరకూ గడువు విధించారు. తర్వాత రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తితో దాన్ని 2019 జూన్ వరకు పొడిగించారు.

తెలంగాణ ఆసుపత్రులకు 4 కాయకల్ప అవార్డులు

ఆసుపత్రుల్లో సౌకర్యాలు, పారిశుద్ధ్యం, వ్యర్థాల నిర్వహణ, ఇన్‌ఫెక్షన్ నివారణ, అదనపు సేవలు అంశాల ప్రాతిపదికన కేంద్ర ప్రభుత్వం ఇచ్చే కాయకల్ప అవార్డులకు రాష్ట్రం నుంచి 4 ఆసుపత్రులు ఎంపికయ్యాయి. జిల్లా ఆసుపత్రుల విభాగంలో కామారెడ్డి జిల్లా ఆసుపత్రికి మొదటి స్థానం దక్కగా... సంగారెడ్డి, కొండాపూర్ జిల్లా ఆసుపత్రులు ద్వితీయ స్థానంలో నిలిచాయి. పీహెచ్‌సీ-సీహెచ్‌సీల విభాగంలో పాల్వంచ సామాజిక ఆరోగ్య కేంద్రానికి ప్రథమ స్థానం దక్కింది. ఢిల్లీలో 2019 అక్టోబర్ 11న ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి హర్షవర్ధన్ ఆయా ఆసుపత్రుల ప్రతినిధులకు అవార్డులు అందజేశారు.

వార్తల్లో వ్యక్తులు

నాటక ప్రయోక్త పసుపులేటి పూర్ణచంద్రరావు మృతి

నాటక ప్రయోక్త పసుపులేటి పూర్ణచంద్రరావు 2019 అక్టోబర్ 11న హైదరాబాద్‌లో మృతి చెందారు. ఆయన సినీ, సాంస్కృతిక, సాహితీ విమర్శకునిగా, బహుముఖ ప్రజ్ఞాశాలిగా గుర్తింపుపొందారు. ఈయన సామాజిక సమస్యలపై నాటకాలను రూపొందించారు. పసుపులేటి నాటక ప్రయోగాలు అత్యధిక భాగం ప్రచారోద్యమ పద్ధతిలో సాగాయి. ఈ నాటక మార్గానికి 'విక్టిమ్స్' థియేటర్ (పీడితుల రంగస్థలి) అని పూర్ణచంద్రరావు నామకరణం చేశారు. ఆయన కవితా సంపుటి 'లెట్ మి కన్ఫెస్' తెలుగు ఆధునిక కవిత్వంలో కొత్త ఒరవడి తెచ్చిన పుస్తకంగా విమర్శకుల ప్రశంసలు పొందింది. విస్తృత పరిశోధన చేసి రచించిన 'సైలెంట్ సినిమా'కు 2014లో జాతీయ ఫిల్మ్ పురస్కారం లభించింది.

శాక్సాఫోన్ విద్వాంసుడు కద్రి గోపాలనాథ్ మృతి

ప్రఖ్యాత శాక్సాఫోన్ విద్వాంసుడు కద్రి గోపాలనాథ్ అయ్యర్(69) కర్ణాటకలోని మంగుళూరులో 2019 అక్టోబర్ 11న మృతి చెందారు. కర్ణాటక సంగీతాన్ని శాక్సాఫోన్ ద్వారా వినిపించడంలో గోపాలనాథ్ అయ్యర్ అంతర్జాతీయ ఖ్యాతిని ఆర్జించారు. మంగళ నాద, జెమ్ టోన్స్, త్యాగరాజ కీర్తనలు, రామ మహోత్సవ, ఇరుముడి తాంగి, సోజోర్న్, వాతాపి.. తదితర 40 పైచిలుకు ఆల్బంలను రూపొందించారు.

తొలి రోదసీ యాత్రికుడు అలెక్సీ లియోనోవ్ మృతి

అంతరిక్షంలో తొలిసారి నడిచిన రష్యన్ రోదసీ యాత్రికుడు అలెక్సీ లియోనోవ్(85) 2019 అక్టోబర్ 11న మరణించారు. 1965లో ఆయన తొలిసారి అంతరిక్షయానం సాగించారు.

అవార్డులు

సుద్దాల జాతీయ పురస్కారం-2019

వివిధ రంగాలకు విశిష్ట సేవలు అందిస్తున్న ప్రముఖులకు సుద్దాల ఫౌండేషన్ అందజేసే సుద్దాల హనుమంతు-జానకమ్మ జాతీయ పురస్కారాన్ని 2019 సంవత్సరానికి సినీ నటుడు, నిర్మాత, దర్శకులు ఆర్.నారాయణమూర్తికి ప్రదానం చేయనున్నట్లు ఫౌండేషన్ వ్యవస్థాపకులు సుద్దాల అశోక్‌తేజ 2019 అక్టోబరు 6న ప్రకటించారు.

డాక్టర్ అశోక్‌కుమార్‌కు బ్రిటన్ 'ఎంబీఈ' అవార్డు

తెలంగాణకు చెందిన డాక్టర్ అశోక్‌కుమార్ భువనగిరి బ్రిటన్ ప్రతిష్టాత్మక 'ఎంబీఈ' అవార్డుకు 2019 అక్టోబరు 9న ఎంపికయ్యారు.అశోక్ చేపడుతున్న స్వచ్ఛంద కార్యక్రమాలు, తెలుగు ప్రజలకు చేస్తున్న సేవకు గుర్తింపుగా ఈ పురస్కారం దక్కింది. ఎలిజబెత్-2 రాణి చేతుల మీదుగా 2019 అక్టోబరు 10న అవార్డును స్వీకరించారు.

చండీప్రసాద్‌కు ఇందిరాగాంధీ పురస్కారం

ప్రముఖ పర్యావరణవేత్త, సామాజిక ఉద్యమకారుడు చండీ ప్రసాద్ భట్(85)కు ఇందిరాగాంధీ జాతీయ సమైక్యత పురస్కారం లభించింది. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ స్మారకార్థం కాంగ్రెస్ పార్టీ దీన్ని నెలకొల్పింది. ఈ పురస్కారం కింద రూ.10 లక్షల నగదు, ప్రశంసా పత్రాన్ని బహూకరించనుంది. ఇందిర వర్ధంతి రోజైన అక్టోబర్ 31న దీన్ని అందజేస్తారు. ఉత్తరాఖండ్‌కు చెందిన భట్ 1964లో దాశోలి గ్రామ్ స్వరాజ్ సంఘ్‌ను ఏర్పాటు చేశారు. అదే అనంతరం వృక్షాలను రక్షించడానికి ఉద్దేశించిన చిప్కో ఉద్యమానికి మాతృసంస్థగా మారింది. భట్ గతంలో రామన్ మెగసెసే అవార్డు, పద్మశ్రీ, పద్మభూషణ్, గాంధీ శాంతి పురస్కారాలను అందుకున్నారు.

నోబెల్ బహుమతులు-2019

2019 సంవత్సరానికి నోబెల్ బహుమతులను ప్రకటించారు.

వైద్యరంగం : వైద్యరంగంలో అందించిన విశిష్ట సేవలకు గానూ ముగ్గురు వైద్యులకు నోబెల్ బహుమతి లభించింది. అమెరికాకు చెందిన డాక్టర్ విలియమ్ జీ కెలీన్ జూనియర్(హార్వర్డ్ యూనివర్సిటీ), డాక్టర్ గ్రెగ్ ఎల్ సెమెన్జా(హాప్కిన్స్ యూనివర్సిటీ), బ్రిటన్‌కు చెందిన డాక్టర్ పీటర్ జే రాట్‌క్లిఫ్(ఫ్రాన్సిస్ క్రిక్ ఇన్‌స్టిట్యూట్)లు నోబెల్ పురస్కారం-2019కు ఎంపికయ్యారు. వీరు ఆక్సిజన్ రక్తంలో ఆక్సిజన్ గ్రహించే కణాలను కనుగున్నందుకు నోబెల్ వీరిని వరించింది.

ఫిజిక్స్ : భౌతికశాస్త్రంలో విశేష పరిశోధనలు చేసిన ముగ్గురు శాస్త్రవేత్తలకు నోబెల్ పురస్కారం లభించింది. కెనడియన్ అమెరికన్ అయిన జేమ్స్ పీబుల్స్, స్విట్జర్లాండ్‌కు చెందిన మైఖేల్ మేయర్,

డిడియర్ క్యులోజ్‌లకు ఈ పురస్కారాన్ని ఉమ్మడిగా అందజేయనున్నట్లు నోబెల్ అసెంబ్లీ 2019 అక్టోబర్ 8న ప్రకటించింది. విశ్వసృష్టిలో సైద్ధాంతిక ఆవిష్కరణలతో పాటు సూర్యుడిని పోలిఉండే నక్షత్రం చుట్టూ తిరిగే గ్రహం కనుగొన్నందున ఈ ముగ్గిరికి నోబెల్ దక్కింది.

కెమిస్ట్రి : లిథియం ఆయాన్ బ్యాటరీ అభివృద్ధికి చేసిన విశేష పరిశోధనలకుగాను రసాయన శాస్త్రంలో ముగ్గురు శాస్త్రవేత్తలకు నోబెల్ పురస్కారం లభించింది.



జర్మనీకి చెందిన జాన్ బి. గుడెనఫ్, బ్రిటిష్-అమెరికన్ అయిన ఎం.స్టాన్లీ విట్టింగమ్, జపాన్‌కు చెందిన అకిరా యోషినోకు సంయుక్తంగా ఈ పురస్కారాన్ని అందజేయనున్నట్లు రాయల్ స్వీడిష్ అకాడమీ 2019 అక్టోబర్ 9న ప్రకటించింది.

సాహిత్యం : సాహితీ రంగంలో విశేషంగా కృషిచేసిన ఇద్దరు ప్రముఖ సాహితీవేత్తలకు నోబెల్ బహుమతి లభించింది. ఆస్ట్రియాకి చెందిన ప్రముఖ నవల, నాటక రచయిత పీటర్ హండ్కేకి 2019 సంవత్సరానికిగాను నోబెల్ పురస్కారం వరించింది. 2018 సంవత్సరానికి పోలండ్‌కి చెందిన ప్రముఖ పర్యావరణ వేత్త, స్త్రీవాది, మేధావి, నవలా రచయిత్రి ఓల్గా టోర్కార్జ్యుక్‌కి 'ద బుక్స్ ఆఫ్ జాకోబ్' అనే నవలకు గానూ ఈ బహుమతి లభించింది.

శాంతి : సరిహద్దు సంక్షోభంతో దీలాపడ్డ ఇథియోపియాకు క్లిష్ట పరిస్థితుల్లో చుక్కానిగా మారి దిశానిర్దేశం చేసిన ఆ దేశ ప్రధానమంత్రి అబియ్ అహ్మద్‌కు 2019కిగాను నోబెల్ శాంతి పురస్కారం లభించింది. పొరుగు దేశం ఎరిట్రియాతో శాంతి ఒప్పందం కుదుర్చుకోవడంతోపాటు కీలక సంస్కరణలతో ఇథియోపియాను ప్రగతి పథంలో పరుగులు పెట్టిస్తున్నందుకు గాను ఆయనకు ఈ గౌరవం లభించింది.

సైన్స్&టెక్నాలజీ

ప్లాస్టిక్‌ను తినే బ్యాక్టీరియా గుర్తింపు

ప్లాస్టిక్‌ను తినేయగల 2 రకాల బ్యాక్టీరియాలను గ్రేటర్ నోయిడాలోని శివ్ నాడార్ వర్సిటీ శాస్త్రవేత్తలు గుర్తించారు. చిత్తడి నేలల్లో గుర్తించిన ఈ రెండు బ్యాక్టీరియాలకు ఎగ్జిగోబ్యాక్టీరియం సిబ్రికం స్ట్రెయిన్ డీఆర్11, ఎగ్జిగోబ్యాక్టీరియం అండే స్ట్రెయిన్ డీఆర్14 అని పేరు పెట్టారు. ఒక్కసారి వాడిపారేసే(సింగిల్ యూజ్ ప్లాస్టిక్-ఎస్‌యూపీ) ప్లాస్టిక్‌లో కీలక పదార్థమైన పాలిస్టిరీన్‌ను ఈ బ్యాక్టీరియా నాశనం చేయగలదని వర్సిటీ శాస్త్రవేత్త రిచా ప్రియదర్శిని తెలిపారు. ప్లాస్టిక్‌ను తినే బ్యాక్టీరియాతోపాటు తాము కొన్ని వైవిధ్యభరితమైన ఇతర బ్యాక్టీరియాను కూడా యూనివర్సిటీలోనే ఉన్న చిత్తడి నేలల్లో గుర్తించామని వర్సిటీ వైస్ చాన్స్‌లర్ రూపమంజరి ఘోష్ పేర్కొన్నారు.

కియా తొలి ఎక్స్‌పీరియన్స్ సెంటర్ ప్రారంభం

దక్షిణ కొరియా ఆటోమొబైల్ దిగ్గజం కియా మోటార్స్ భారత్‌లో తన తొలి ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను 2019 అక్టోబర్ 10న ప్రారంభించింది. హర్యానాలోని గురుగ్రామ్‌లో 'బీట్ 360' పేరుతో 5,280 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఈ సెంటర్‌ను ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా కియా ఎండీ, సీఈఓ కూక్ హున్ షిమ్ మాట్లాడుతూ.. 'ఈ సెంటర్ పేరులోని మొదటి పదం బీటింగ్ ఆఫ్ హార్ట్‌కు సంక్షిప్తం. సంస్థ వ్యాపార ప్రాంతాలు (జోన్స్)కు సంకేతంగా 3, ఇంద్రియాలను సూచిస్తూ 6, హద్దులు లేవని చెప్పేందుకు 0 ఎంపిక చేసి 360 అని నిర్ణయించాం. త్వరలోనే దేశంలోని మెట్రో నగరాల్లో కూడా ఇటువంటి సెంటర్లను ఏర్పాటుచేయాలని యోచిస్తున్నాం' అని వ్యాఖ్యానించారు.

క్రీడలు

కింగ్స్ ఎలెవన్ పంజాబ్ కోచ్‌గా కుంబ్లే

కింగ్స్ ఎలెవన్ పంజాబ్ జట్టు ప్రధాన కోచ్‌గా టీమ్‌ఇండియా మాజీ కెప్టెన్ అనిల్ కుంబ్లే నియమితుడయ్యాడు. ఇప్పటి వరకు ఒక్కసారి కూడా ఐపీఎల్ ట్రోఫీ గెలవని ఆ జట్టు.. వచ్చే సీజన్‌లో ఎలాగైనా విజేతగా నిలవాలనే లక్ష్యంతో కోచింగ్ సిబ్బందిని మార్చింది. రాబోయే సీజన్‌లో కుంబ్లే ప్రధాన కోచ్‌గా, టీమ్‌ఇండియా మాజీ స్పిన్నర్ సునీల్ జోషి సహాయక కోచ్‌గా, దక్షిణాఫ్రికా దిగ్గజ ఆటగాడు జాంటీ రోడ్స్ ఫీల్డింగ్ కోచ్‌గా, ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ జార్జ్ బెయిలీ బ్యాటింగ్ కోచ్‌గా బాధ్యతలు నిర్వర్తించనున్నారు. మరోవైపు విండీస్ దిగ్గజం కౌర్ట్నీ వాల్ష్‌ను ప్రతిభాన్వేషకుడిగా జట్టు యాజమాన్యం నియమించింది.

ఇంగ్లండ్ హెడ్ కోచ్‌గా క్రిస్ సిల్వర్‌వుడ్

ఇంగ్లండ్ క్రికెట్ జట్టు నూతన హెడ్ కోచ్‌గా క్రిస్ సిల్వర్‌వుడ్‌ను ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు(ఈసీబీ) 2019 అక్టోబర్ 7న నియమించింది. ఇప్పటివరకు ఇంగ్లండ్ జట్టు హెడ్ కోచ్‌గా ఉన్న ట్రెవర్ బేలిస్... ఒప్పందం ముగియడంతో పదవి నుంచి తప్పుకున్నారు. దీంతో 44 ఏళ్ల సిల్వర్‌వుడ్‌కు కోచింగ్ బాధ్యతలు అప్పగించారు. కొత్త కోచ్ బాధ్యతలు న్యూజిలాండ్ పర్యటనతో మొదలవుతాయి. ఇంగ్లండ్‌కు చెందిన సిల్వర్‌వుడ్ రెండేళ్లుగా బేలిస్ బృందంలో బౌలింగ్ కోచ్‌గా పనిచేస్తున్నారు. తన కెరీర్‌లో ఆరు టెస్టులు, ఏడు వన్డేలు ఆడాడు.

భారత అథ్లెట్ నిర్మలపై నాలుగేళ్ల నిషేధం

భారత అథ్లెట్ నిర్మల షెరాన్‌పై నాలుగేళ్ల నిషేధం విధిస్తున్నట్లు అథ్లెటిక్స్ ఇంటిగ్రిటీ యూనిట్ (ఏఐయూ) 2019 అక్టోబర్ 9న ప్రకటించింది. 2018 జూన్‌లో నిర్వహించిన డోపింగ్ పరీక్షలో నిర్మల నిషేధిత ఉత్ప్రేరకం తీసుకున్నట్లు తేలింది. దీంతో నిర్మలపై 2016, ఆగస్టు నుంచి నాలుగేళ్లపాటు నిషేధం విధిస్తున్నట్లు ఏఐయూ పేర్కొంది.

20 ఏళ్ల కెరీర్‌ను పూర్తి చేసుకున్న మిథాలీరాజ్

భారత మహిళా క్రికెట్ దిగ్గజం మిథాలీరాజ్ అంతర్జాతీయ క్రికెట్‌లో 2019 అక్టోబరు 9 నాటికి 20 ఏళ్ల కెరీర్‌ను పూర్తి చేసుకుంది. దక్షిణాఫ్రికాతో తొలి వన్డేతో మిథాలీ ఈ మైలురాయిని చేరుకుంది. 1999 జూన్ 26న మిథాలీ.. ఐర్లాండ్‌పై తొలిసారిగా వన్డే మ్యాచ్ ఆడింది. ఆమె చివరిగా అంతర్జాతీయ మ్యాచ్ మార్చిలో ఆడింది. తర్వాత ఇప్పుడే మళ్లీ బరిలోకి దిగడంతో కాస్త ఆలస్యంగా 20 ఏళ్ల పూర్తిచేసుకుంది. మొత్తం కెరీర్లో 204 వన్డేలు, 10 టెస్టులు, 89 టీ20లు ఆడింది. మహిళల వన్డే క్రికెట్లో అత్యధిక మ్యాచ్‌లు ఆడిన, పరుగులు చేసిన క్రికెటర్ మిథాలీనే.

ఐఓఏతో జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ ఒప్పందం

భారత ఒలింపిక్ సంఘం(ఐఓఏ)తో దిగ్గజ స్టీల్ కంపెనీ జిందాల్ సౌత్ వెస్ట్ (జేఎస్‌డబ్ల్యూ) గ్రూప్ భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందం ప్రకారం 2020 టోక్యో ఒలింపిక్స్‌లో పాల్గొనేందుకు వెళ్లబోయే భారత బృందం కోసం అక్కడ 'ఇండియా హౌజ్'ను జేఎస్‌డబ్ల్యూ నిర్మించనుంది. క్రీడాగ్రామానికి సమీపంలో 2200 చదరపు మీటర్ల విస్తీర్ణంలో తొలిసారి భారత్ అక్కడ ఒలింపిక్ హాస్పిటాలిటీ హౌజ్‌ను నిర్మించనుంది.

ఐసీసీ ర్యాంకింగ్స్

ఐసీసీ ర్యాంకింగ్స్‌లో రోహిత్ శర్మ కెరీర్‌లోనే అత్యుత్తమంగా 17వ స్థానం సాధించాడు. ఓపెనర్ మయాంక్ అగర్వాల్ 25వ స్థానం సాధించాడు. 1937 పాయింట్లతో ఆస్ట్రేలియా బ్యాట్స్‌మన్ స్టీవ్‌స్మిత్ అగ్రస్థానంలో, భారత కెప్టెన్ విరాట్‌కోహ్లి 899 పాయింట్లతో రెండో స్థానంలో ఉన్నారు. బౌలింగ్ విభాగంలో ఆఫ్ స్పిన్నర్ అశ్విన్ 10వ స్థానంలో, ఫాస్ట్ బౌలర్ షమి 16వ స్థానంలో ఉన్నారు. రవీంద్ర జడేజా ఆల్ రౌండర్ల జాబితాలో 2వ స్థానంలో ఉన్నాడు. ఐసీసీ మహిళల వన్డే ర్యాంకింగ్స్‌లో భారత జట్టు 125 పాయింట్లతో 2వ స్థానంలో కొనసాగుతోంది. టీ20ల్లో హర్మన్‌ప్రీత్ సేన 5వ స్థానంలో ఉంది. వన్డేలు, టీ20లు రెండింటిలోనూ ఆస్ట్రేలియా అగ్రస్థానంలో కొనసాగుతోంది.